## క్లుప్తంగా

### నిత్యాన్నదానానికి విరాళం



స్వామి వారి నిత్యాన్నదానం కోసం ఈఓకు విరాళం అందిస్తున్న దాత

**పాలకొల్లు సెంట్రల్:** పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు మండలంలోని కాపవరం గ్రామానికి చెందిన దాత పి.వెంకట నరసయ్య రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. గురువారం ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావుకు అందజేశారు. అనంతరం దాతను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి రశీదును అందజేశారు. అర్చకులు వీరబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### చేనేత కార్మికులను మోసం చేసిన చంద్రబాబు



వీరా మల్లికార్జునుడు

**పాలకొల్లు సెంట్రల్:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ చేనేత కార్మికులను మోసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు వీరా మల్లికార్జునుడు అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం కింద సంవత్సరానికి రూ.24 వేలు ఇచ్చి వంద యూనిట్లు వరకూ ఉచిత విద్యుత్ అందించారని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు గత ఎన్నికల్లో రెండు వందల యూనిట్లు ఉచితంగా ఇస్తానని హామీ ఇవ్వడమే కాకుండా రూ. 24 వేలు ఇస్తానని చెప్పినా ఇంతవరకూ పథకం గురించి మాట్లాడడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే నేతన్నలకు ఎన్నికల్లో ఏ హామీలైతే ఇచ్చారో వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### గ్రంథాలయంలో ఆధ్యాత్మిక పుస్తకాల అందజేత



గ్రంథాలయంలో ఆధ్యాత్మిక పుస్తకాలు అందిస్తున్న దాత సూర్య కిరణ్

**పాలకొల్లు సెంట్రల్:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంతో గొప్ప విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు గ్రంథాలయాల్లో ఉంటాయని దాత బంగారు సూర్యకిరణ్ అన్నారు. గురువారం తన తల్లిదండ్రులు బంగారు వెంకటప్రసాద్ గుప్త, ఉమాకామేశ్వరి దంపతులు సేకరించిన శ్రీశైలప్రభ, సప్తగిరి ఆధ్యాత్మిక పుస్తకాలు గ్రంథాలయాధికారిణి వి.శాంతకుమారికి అందజేశారు. సూర్యకిరణ్ మాట్లాడుతూ ఈ పుస్తకాలు వల్ల నేటి యువతరానికి ఆధ్యాత్మిక విషయాలు తెలుసుకోవడానికి, భక్తి భావం పెంపొందించుకోవడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. సుమారు 200 పుస్తకాలు అందించినట్లు తెలిపారు.

### సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి

**పెనుగొండ/యలమంచిలి:** వరి సాగులో దిగుబడులు కాపాడుకోవడానికి రైతులు సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలని ఇలపర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ అధ్యక్షుడు కేతా సత్తిబాబు అన్నారు. గురువారం ఇలపర్రులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా బ్రోమోడయోలిన్ విషపు ఎరను రైతులకు పంపిణీ చేశారు. అలాగే యలమంచిలి మండలంలోని రైతు సేవా కేంద్రాలలో గురువారం మండల వ్యవసాయాధికారి దుంగా బాల త్రిపుర సుందరి ఆధ్వర్యంలో సిబ్బంది రైతులకు ఎలుకల నివారణ మందు పొట్లాలను ఉచితంగా అందజేశారు.

### 25న గుంటూరులో యూటీఎఫ్ బహిరంగ సభ

**పాలకొల్లు సెంట్రల్:** పాఠశాల విద్యారంగంలో బోధనేతర పనులు భారంతో ఉపాధ్యాయులు బోధనకు దూరం అవుతున్నారని ఈ పరిస్థితిని మార్చాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. సెప్టెంబర్ 15వ తేది నుండి రాష్ట్ర వ్యాప్తంగా 5 ప్రాంతాల్లో జరుగుతున్న యూటీఎఫ్ ప్రచార రణభేరి కార్యక్రమం గురువారం పాలకొల్లు చేరుకుంది. కార్యక్రమంలో విజయరామరాజు, ఏకేవి రామభద్రం, టి.చక్రవర్తి, ఎస్.జ్యోతిబసు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**పాలకొల్లు సెంట్రల్:** ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్ అన్నారు. గురువారం పోడూరు మండలంలోని సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కె.డేవిడ్ రాజు, వి.శ్రీనివాస్, కట్టా దానేశ్వరరావు, భరణికాపుల రాంబాబు, గుబ్బల భగవాన్, పి.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

# మంత్రి గారూ.. కాస్త ఇటు చూడండి సారూ..!

- కొద్దిపాటి వర్షానికే నీట మునుగుతున్న హౌసింగ్‌బోర్డు కాలనీ
- మంత్రిగారి నివాసం ఏరియా మినహా ఆ కాలనీ అంతా మునకే

**పాలకొల్లు సెంట్రల్:** పట్టణంలో కొద్దిపాటి వర్షానికే హౌసింగ్‌బోర్డు కాలనీ నీట మునుగుతోంది. వర్షం వచ్చిందంటే చాలు ఈ కాలనీ రోడ్లన్నీ మోకాలు లోతులో నీళ్లు నిలబడిపోతున్నాయి. ఈ కాలనీ గురించే ఇంత ప్రత్యేకత ఏమిటని అనుకుంటున్నారా? రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నివాసం ఉండే ప్రాంతం కూడా ఇదే. పట్టణంలో కొద్దిపాటి వర్షం వచ్చిందంటే చాలు బస్టాండ్ సెంటర్, హౌసింగ్ బోర్డు కాలని, ఛాంబర్స్ కళాశాల రోడ్డు, సలాదివారి తోట, బంగారువారి చెరువుగట్టు, బ్రాడీపేట ఇలా కొన్ని ప్రాంతాల్లో రోడ్లు జలమయమవుతుండడం కనిపిస్తుంది. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్లలో సిల్ట్ తీయించడం వల్ల ప్రస్తుతానికి ఈ ప్రాంతాలన్నీ వర్షం కురిసిన కాసేపటికి వర్షం నీరు తగ్గిపోతుంది. ఒకానొక సమయంలో బస్టాండ్‌లో బస్ ఎక్కాలంటే ఈతకొట్టుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. మునిసిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పట్టణంలో కొన్ని ప్రాంతాలతో పాటు, బస్టాండ్ సెంటర్లో కూడా నీరు తగ్గుముఖం పడుతుంది. కానీ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నివాసం ఉండే 26వ వార్డులో వీధులన్నీ కొద్దిపాటి వర్షానికి జలమయమవుతున్నాయి.



హౌసింగ్‌బోర్డులో ప్లే స్కూల్ వద్ద డ్రెయినేజీ, రోడ్డు దుస్థితి



26వ వార్డు సచివాలయం ఇలా



హౌసింగ్ బోర్డు కాలనీలో సచివాలయానికి వెళ్లే మార్గం

**కాలనీ మొత్తం ఇంతే**

ఈ కాలనీలో ఉండే గరికిశెట్టి వీధి, సచివాలయం వీధి, సుభాష్‌చంద్రబోస్ స్కూల్, టీటీడీ కల్యాణ మండపం రోడ్డు ప్రాంతం ఇలా అన్ని వీధులు జలమయమయ్యాయి. ఈ వార్డులో ఉన్న సచివాలయంలోకి వెళ్లాలన్నా, సుభాష్ చంద్రబోస్ హైస్కూల్లోకి వెళ్లాలన్నా మోకాలు లోతు నీటిలో వెళ్లాల్సిందే. ఈ కాలనీ ప్రజలు ఇచ్చిన సమాచారంతో అక్కడకు వెళ్లగా మంగళవారం కురిసిన వర్షానికి ఆ కాలనీల్లో డ్రెయినేజీలు, రోడ్లు మునిగిపోయాయి. ఇక్కడ డ్రెయినేజీలు చాలా చిన్నవి, రోడ్లు పల్లంగా ఉండడం, డ్రెయినేజీలో సిల్ట్ తీయకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడుతుందని గగ్గోలు పెడుతున్నారు. సాక్షాత్తూ రాష్ట్ర మంత్రి కూడా ఇక్కడే ఉంటున్నా మా వార్డుకు మాత్రం ఈ దుస్థితి తప్పడం లేదు. దయచేసి మా పేర్లు రాయకండి మళ్లీ మేము ఇబ్బందులు పడతామని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. మా ప్రాంతం కొద్దిగా అభివృద్ధి జరిగేలా ప్రచారం చేయండి. మేము మునిసిపల్ అధికారుల చుట్టూ తిరిగినా పనికావడం లేదని వాపోయారు. ఇప్పటికైనా మునిసిపల్ శానిటరీ అధికారులు మంత్రి నివాస ప్రాంతం అయిన 26వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తారో? లేదో? వేచి చూడాల్సిందే.



సుభాష్‌చంద్రబోస్ హైస్కూల్ వద్ద వర్షం నీరు



రామాలయం నుండి వచ్చే రోడ్డులో వర్షం నీరు



26వ వార్డులో గరికిశెట్టి వీధిలో వర్షం నీరు



క్షత్రియ కల్యాణ మండపానికి వెళ్లే రోడ్డులో నిలిచిన నీరు

# వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

**పెనుగొండ:** వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల సంఘ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గణేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘ పిలుపు మేరకు గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇవ్వడంతో, వీఆర్‌ఏలు అందరూ చంద్రబాబు విజయానికి కృషి చేశారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా నేటి వరకూ అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో మండల వీఆర్‌ఏల సంఘ అధ్యక్షుడు వెన్నేటి పాపారావు, ఉపాధ్యక్షుడు కంకిపాటి వెంకట్రావు, మండల కార్యదర్శి బొక్కా దుర్గా ప్రసాద్, తానేటి భాస్కరరావు, చదలవాడ రమేష్, సుబ్బారావు, కొమ్మిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**నరసాపురంలో.**

**నరసాపురం రూరల్:** గ్రామ రెవెన్యూ సహాయకుల ( వీఆర్‌ఏ ) న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం, సీపీఐ నాయకులు కౌరు పెద్దిరాజు, ఆరేటి మత్యుంజయ, నెక్కంటి క్రాంతి కుమారులు డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం నుంచి రెండు రోజులపాటు తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నరసాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ ధర్నా కార్యక్రమంలో కమ్యూనిస్టు నాయకులు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పేస్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు మోటూరి మోషే, నరసాపురం మండల అధ్యక్ష, కార్యదర్శులు రాపాక వరప్రసాద్, కొండపల్లి వంశీ ఉపాధ్యక్షుడు ఎల్ల రామకష్ట, కోశాధికారి నీలం నాగ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.



పెనుగొండ: తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న వీఆర్‌ఏలు



పాలకొల్లు సెంట్రల్: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు



పెనుమంట్ర: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు



నరసాపురం రూరల్: మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

**పాలకొల్లులో..**

**పాలకొల్లుసెంట్రల్:** రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా పడుతున్న గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పాలకొల్లు వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు తంగెళ్ల గోవిందరావు కోరారు. గురువారం వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పే స్కేలు, అమలు, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులకు ప్రమోషన్స్, కారుణ్య నియామకాలు వంటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తాడిపర్తి వెంకటేశ్వరరావు, సెక్రటరీ పంబ సీతామహాలక్ష్మి, ట్రెజరర్ దాసరి భవాని, దాకవరపు వెంకట శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**పెనుమంట్రలో..**

**పెనుమంట్ర:** కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ తమ సమస్యలను కూడా పరిష్కరించాలని కోరుతూ గురువారం పెనుమంట్ర మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈసందర్భంగా వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షురాలు ఎల్ఎం తులసి మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బీసీ గంగాధర్, పి.ఏసుబాబు, కేకే ప్రసాద్, పి.నాగేశ్వరరావు, టి.రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

### నేడు చలో మెడికల్ కాలేజ్

**నరసాపురం:** వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం పాలకొల్లు మండలం దగ్గులూరులో ఉన్న మెడికల్ కళాశాల వద్ద చలో మెడికల్ కాలేజ్ పేరిట నిరసన కార్యక్రమం ఉంటుందని పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ యువజన విభాగం, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఉదయం 6.30 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

### కార్మిక నేతలకు నివాళి

**నరసాపురం:** కార్మిక వర్గ నాయకుడు పొన్నాడ రాము, వంకల రాము ప్రథమ వర్ధంతిని స్థానిక మీరా గ్రంథాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు పాల్గొన్నారు.

### ఖాళీలను భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.ఆంజనేయులు

**యలమంచిలి:** స్వర్ణ పంచాయతీల్లో ఖాళీ పోస్టులను సీనియారిటీ ప్రకారం పంచాయతీ కార్మికులతో భర్తీ చేయాలని పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎ.ఆంజనేయులు డిమాండ్ చేశారు. మేడపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్ణ పంచాయతీలు అంటూ హడావుడి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల వేతనాలు సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సంఘ మండల అధ్యక్షుడు మానుకొండ శివరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు చింత రాజారెడ్డి, కంచుస్తంభం శివ, సిర్రా కిరణ్, వినుకొండ వాసు, సోమిశెట్టి ప్రసాద్, శేఖర్, సాగి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

### యలమంచిలి ఎంపీడీఓగా ప్రసాద్

**యలమంచిలి:** ఎఫ్ఏసీ (పూర్తి అదనపు బాధ్యతలు) ఎంపీడీఓగా జక్కంశెట్టి దేవార్క్ వెంకట ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత ఆరు నెలలు ప్రసూతి సెలవు పెట్టడంతో డిప్యూటీ ఎంపీడీఓగా పని చేస్తున్న ప్రసాద్‌ను ఎఫ్ఏసీ ఎంపీడీఓగా నియమిస్తూ జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీహరి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్‌కు కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

## పేదలకు వైద్య విద్య దూరం చేయడం సిగ్గు చేటు

**పెనుగొండ:** ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం సిగ్గు చేటని, దీంతో వైద్య విద్య పేదలకు అందని ద్రాక్షగా మిగిలిపోతుందని వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగ నాయకులు కోటే శశి మధు, కోట గిరిధర్‌లు విమర్శించారు. గురువారం ఆచంటలో వారు విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలకు అనుమతులు తీసుకువచ్చి, ఏడు కళాశాలలు పూర్తి చేశారన్నారు. రెండేళ్ల క్రితమే ఐదు కళాశాలల్లో తరగతులు మొదలయ్యాయన్నారు. పేద, దళిత, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా వైద్య విద్యను తీసుకువస్తే, దానిని నేడు చంద్రబాబు పూర్తిగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చలో పాలకొల్లును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జిల్లెళ్ల మహేష్‌బాబు, ఊడి రాజేంద్ర, కోగంటి అంబేడ్కర్, షేక్ వల్లి తదితరులు పాల్గొన్నారు.



ఆచంటలో విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

## మెడికల్ కాలేజీల్లో పీపీపీ విధానాన్ని రద్దు చేయాలి

**నరసాపురం రూరల్:** కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలని తీసుకున్న నిర్ణయం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు అన్యాయం చేస్తున్నట్లేనని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర కుమార్ అన్నారు. గురువారం ఆ సంఘం మండల శాఖ సమావేశం నరసాపురం మండలం సీతారాంపురం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసే కుట్రలో భాగమే ఈ నిర్ణయం అన్నారు. తక్షణం ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు జె.విజయ్ కుమార్, కాటిక తాతారావు, డి.సురేష్ బాబు, ఎం.వెంకటేష్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర కుమార్

## కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

**నరసాపురం రూరల్:** చిన్నపిల్లలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. గురువారం మొగల్తూరు ప్రాజెక్టు పరిధిలోని రామన్నపాలెం గ్రామంలో రాష్ట్రీయ పోషణ ఎనిమిదో మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థూలకాయం నివారణ, శిశువులు, చిన్నపిల్లలు ఆహారపు అలవాట్లు, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలకు కలిగే ఆరోగ్య సమస్యలు రక్తహీనత వంటి అంశాలపై ఎమ్మెల్సీ జ్యోతి మాట్లాడారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రసాద్, మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీపార్వతి, ఏఎన్ఎం వై.తబిత తదితరులు పాల్గొన్నారు.

**పెనుమంట్రలో..**

**పెనుమంట్ర:** తల్లిదండ్రులు తమ పిల్లల ఆహారపు అలవాట్లతో పాటు రోజువారీ దినచర్య, శారీరక శ్రమ, నిద్ర వంటి విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ కె.కృష్ణకుమారి అన్నారు. గురువారం పెనుమంట్ర, ఆలమూరు గ్రామాల్లోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహార మాసోత్సవ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



రామన్నపాలెంలో రాష్ట్రీయ పోషణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

## రైల్వే సమస్యలను పరిష్కరించాలి

**నరసాపురం:** సమస్యలు పరిష్కరించి రైల్వే ప్రయాణికుల బాధలు తీర్చాలని గురువారం నరసాపురం వచ్చిన విజయవాడ డివిజన్ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనంద్‌పాటిల్‌కు పలువురు వినతిపత్రాలు ఇచ్చారు. పట్టణానికి చెందిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనమాల శ్రీనివాస్ డీఆర్ఎంను కలిసి వినతిపత్రం ఇచ్చారు. నరసాపురం నుంచి విశాఖపట్టణంకు రాత్రిపూట దశాబ్దాలుగా నడిచిన సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను కరోనా సమయంలో నిలుపుదల చేశారని, అప్పటి నుంచి మళ్లీ ఈ రైలును పునరుద్ధరించలేదన్నారు. ప్రయాణికులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే ఈ రైలును పునరుద్ధరించాలని కోరారు. డీఆర్‌యూసీసీ సభ్యుడు జక్కంపూటి కుమార్ పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. సింహాద్రి ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ, భీమడోలు స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని, వీరవాసరం స్టేషన్‌లో కూడా అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని, తణుకు స్టేషన్‌లో లిఫ్ట్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు.



రైల్వే డీఆర్ఎంకు వినతిపత్రం ఇస్తున్న వనమాల శ్రీనివాస్

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

**నరసాపురం రూరల్:** రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సరిపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు పట్టణంలోని 30వ వార్డు జవదాలపేటకు చెందిన ఉన్నమట్ల రూధర్‌ఫాల్ (56) మోటార్ బైక్‌పై సరిపల్లి మీదుగా వెళుతుండగా ఆగర్తిపాలెం రోడ్డులో బండి అదుపు తప్పి కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం కాకినాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. మృతుని కుమారుడు ఉన్నమట్ల విజయకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### గుండెపోటుతో సచివాలయ ఉద్యోగి మృతి



హేమంత్ కుమార్

**పాలకొల్లు సెంట్రల్:** కాపవరం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఉద్యోగి గుడాల హేమంత్ కుమార్ (47) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. పోడూరు మండలంలోని జిన్నూరుకు చెందిన హేమంత్ కుమార్ ఇంటి వద్ద ఉండగా గుండె పోటు రావడంతో పాలకొల్లు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

**పని ఒత్తిడే కారణమా?**

ఇటీవల సచివాలయ సిబ్బంది తమకు పనిభారం ఎక్కువవుతోందంటూ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కార్యాలయ పనివేళలు పాటించకుండా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారని, సెలవులు, పండుగలు, ఆదివారాల్లో బలవంతపు విధులు చేయిస్తున్నారని వీటిని పరిష్కరించాలంటూ కోరుతూ ప్రభుత్వానికి నోటీసులు కూడా ఇచ్చారు. హేమంత్ మృతి నేపథ్యంలో పని ఒత్తిడి అంశం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తోటి ఉద్యోగి మృతిపై సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు.

### వైభవంగా వాసవీ హోమం

**పెనుగొండ:** పెనుగొండ వాసవీ శాంతి ధాంలో కర్ణాటక బెంగుళూరు నుంచి వచ్చిన భక్తులు వాసవీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలోని రుషి గోత్ర మందిరంలో వాసవీ మాతకు ప్రత్యేక దంపతుల పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.